సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



నయనోత్సవం
నృత్య విన్యాసం 8లో



మలబార్-2024లో భాగంగా సోమవారం విశాఖ తీరంలో సీఫేజ్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నౌకాదళాలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. -మహారాణిపేట 8లో



తిరుమలనగర్‌కు
కేంద్ర జలశక్తి అవార్డు 8లో

కూటమికి ఫుల్ కిక్..!



- కూటమి ఎమ్మెల్యేల అనుచరులకే మెజార్టీ వైన్‌షాపులు
- జిల్లాలో 155 షాపులకు పూర్తయిన లాటరీ ప్రక్రియ
- ఒక్కో దుకాణానికి 3 నుంచి 10 దరఖాస్తులు చేసిన సిండికేట్లు
- దీంతో 50 శాతానికి పైగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకే షాపులు
- 155 షాపులకు దరఖాస్తులు చేసిన ఢిల్లీకి చెందిన లిక్కర్ వ్యాపారి
- లాటరీలో 6 దుకాణాలు కైవసం
- 16వ తేదీ నుంచి వైన్‌షాపుల నిర్వహణకు ప్రొవిజనల్ లైసెన్సుల జారీ

విశాఖ సిటీ: అందరూ అనుకున్నట్లే జరిగింది. వైన్‌షాపుల లాటరీలో సిండికేట్ల హవా స్పష్టంగా కనిపించింది. కూటమి ఎమ్మెల్యేల అనుచరులు, సిండికేట్లు మెజార్టీ షాపులను కైవసం చేసుకున్నారు.



లాటరీ తీస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఒక్కో దుకాణానికి అత్యల్పంగా 3 నుంచి అత్యధికంగా 10 వరకు దరఖాస్తులు చేయించారు. దీంతో 100కు పైగా వీరే దక్కించుకున్నారు. వీరికి తోడు ఢిల్లీ లిక్కర్ వ్యాపారి జిల్లాలో ఉన్న 155 వైన్‌షాపులకు దరఖాస్తులు వేయడంతో అధికారులు సైతం విస్తుపోయారు. ఇందులో 6 షాపులు సొంతం చేసుకోవడం విశేషం. జిల్లాలో 155 వైన్‌షాపులకు కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారు. పది రోజుల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 4,139 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 వరకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్ సమక్షంలో లాటరీ నిర్వహించారు.



వైన్‌షాప్ దక్కించుకున్న వారి నగదు చెల్లింపులు

అంతా సిండికేట్ల మయం : లాటరీ ప్రక్రియ పారదర్శకంగా ప్రశాంతంగా జరిగినప్పటికీ.. సిండికేట్ల హవా స్పష్టంగా కనిపించింది. జనప్రియ, పుష్కరిణి సిండికేట్ల నిర్వాహకులు 100 నుంచి 120 వైన్‌షాపులకు అనేక పేర్లతో దరఖాస్తులు చేయించారు. గెజిట్ నంబర్ ప్రకారం వరుస క్రమంలో దుకాణాలకు లాటరీ నిర్వహించగా.. అన్నింటికీ వీరే అక్కడ దర్శనమిచ్చేవారు. ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. నిర్ణీత సమయానికి ముందే వచ్చిన దరఖాస్తుదారులు ముందుగా గురజాడ కళాక్షేత్రంలోకి అనుమతించారు. అక్కడి నుంచి షాపు నంబర్ల ప్రకారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలోకి పంపించారు. ఆయా షాప్‌నకు వచ్చిన దరఖాస్తుల ప్రకారం నంబర్లను పేర్చి దాన్ని దరఖాస్తుదారులకు చూపించి ఒక బాక్సులో వేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు లాటరీ తీశారు. ప్రతి షాప్‌నకు అసలు కేటాయింపుదారునితో పాటు రిజర్వ్-1, రిజర్వ్-2 కింద మరో ఇద్దరి టోకెన్లు తీశారు. ఒకవేళ షాపు కేటాయించిన వ్యక్తి వైన్ షాపునకు నిర్ణీత నగదు చెల్లించని పక్షంలో రిజర్వ్-1లో వచ్చిన వారికి అవకాశం ఇస్తారు. అతడు డబ్బు కట్టకపోతే రిజర్వ్-2కు అనుమతిస్తారు. ఇలా ప్రతి దుకాణానికి లాటరీ ప్రక్రియను చేపట్టారు. ఇలా ఏ వైన్‌షాప్‌నకు లాటరీ తీసినా ఈ సిండికేట్‌కు సంబంధించిన వారే ఉండడం గమనార్హం. దరఖాస్తుల్లో పేర్లు మార్చే తప్ప.. హాల్‌లో వీరు మాత్రం చివరి వరకు కదలకపోవడం విశేషం. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో షాప్‌నకు 3 నుంచి 10 వరకు దరఖాస్తులు వేయడం ఈ రెండు సిండికేట్లకే అత్యధిక దుకాణాలు దక్కాయి.

155 షాపులకు ఢిల్లీ వ్యాపారి దరఖాస్తులు

జిల్లాలో వైన్‌షాపుల కోసం ఒకవైపు కూటమి ప్రజాప్రతినిధులు, సిండికేట్లు పెద్ద ఎత్తున పోటీ పడగా.. మరోవైపు ఢిల్లీకి చెందిన లిక్కర్ వ్యాపారి కూడా విశాఖ జిల్లాలో మద్యం వ్యాపారంపై దృష్టి పెట్టాడు. ఇక్కడి సిండికేట్లను మించి 155 వైన్‌షాపులకు దరఖాస్తులు చేశాడు. అమిత్ అగర్వాల్, నందినీ గోయల్, సారికా గోయల్, సౌరభ్ గోయల్ పేర్లతో దరఖాస్తులు సమర్పించాడు. ఒక్కో దుకాణ లాటరీకి దరఖాస్తు



అన్ని షాపులకు దరఖాస్తు చేసిన ఢిల్లీ వ్యాపారి (సర్కిల్)

చేసిన 24 నుంచి 30 మంది మారుతున్నప్పటికీ ఆయన మాత్రం అక్కడి నుంచి కదలలేదు. వరుసగా అన్ని షాపుల లాటరీ నిర్వహణలోను పాల్గొనడంతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎక్సైజ్ సిబ్బంది ద్వారా ఆరా తీశారు. అతడిని ప్రశ్నించిన ఎక్సైజ్ అధికారులతో పాటు కలెక్టర్, జేసీ కూడా విస్తుపోయారు. 155 షాపులకు దరఖాస్తు చేసినట్లు సదరు వ్యక్తి చెప్పడంతో షాక్‌కు గురయ్యారు. అన్ని షాపులకు కలిపి దరఖాస్తు రుసుమే రూ.3 కోట్లు అవుతుంది. అంత స్థాయిలో దరఖాస్తు ఫీజు చెల్లించి సదరు వ్యాపారికి లాటరీలో 6 షాపులు దక్కాయి. ఒడిశా నుంచి కూడా ఒక లిక్కర్ కింగ్ భారీగా దరఖాస్తులు సమర్పించినప్పటికీ.. కేవలం 2 షాపులు మాత్రమే లభించాయి.

కూటమి అనుచరుల హవా



ఒకవైపు సిండికేట్ల వ్యవహారం కొనసాగితే మరోవైపు కూటమి ఎమ్మెల్యేల అనుచర వర్గం హవా కూడా ఎక్కువగానే ఉంది. వాస్తవానికి టీడీపీ ఎమ్మెల్యే జనప్రియ సిండికేట్‌లో భాగస్వామ్యమైనప్పటికీ అతని అనుచరులు కూడా కొన్ని షాపులు దక్కించుకున్నారు. అలాగే గాజువాక టీడీపీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అనుచరులు లాటరీలో ఆరు దుకాణాల వరకు సొంతం చేసుకున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అనుచరులకు కూడా 2 నుంచి 6 షాపులు లాటరీలో దక్కాయి.

వైన్‌షాపుల కోసం పెద్ద ఎత్తున మహిళలు



వైన్‌షాపుల కోసం పెద్ద ఎత్తున మహిళలు సైతం పోటీ పడ్డారు. వీరిలో యువతుల నుంచి వృద్ధుల వరకు ఉన్నారు. కొందరు మహిళలు చంటిపిల్లలతో లాటరీకి హాజరయ్యారు. జిల్లాలో 31 వరకు వైన్‌షాపులను మహిళలే దక్కించుకోవడం విశేషం.

రేపటి నుంచి కొత్త వైన్‌షాపులు

జిల్లాలో బుధవారం నుంచి వైన్‌షాపుల ప్రారంభానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లాటరీలో షాపును సొంతం చేసుకున్న వారు వెంటనే నిర్ణీత రుసుమును చెల్లించారు. అలాగే సోమవారం సాయంత్రానికి 80 మందికి ప్రొవిజన్ లైసెన్సులు సైతం ఎక్సైజ్ అధికారులు అందజేశారు. దీంతో బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు బార్లా తెరుచుకోనున్నాయి.

న్యూస్‌రీల్

'స్వర్ణాంధ్ర 2047' ప్రణాళికపై సీఎస్ దిశానిర్దేశం

మహారాణిపేట: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ దిశానిర్దేశం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సోమవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాథమిక రంగం పరిధిలోకి వచ్చే అంశాలు, విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేయాలని చెప్పారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో రూపొందించబోయే విజన్ ప్రణాళిక గురించి వివరించారు. మండల, జిల్లా స్థాయిల్లో చేపడుతున్న చర్యల గురించి తెలిపారు. సీపీవో శ్రీనివాసరావు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు రేపు

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి సోమవారం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 4, 3వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట : కేంద్ర స్కిల్ డెవలప్‌మెంటు శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరీ మంగళవారం విశాఖ రానున్నారు. న్యూఢిల్లీ నుంచి విమానంలో బయలు దేరి మంగళవారం ఉదయం 8.20 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏపీఎంటీజెడ్)కు వెళతారు. ఉదయం 9-12 గంటల వరకు అక్కడే ఉంటారు. అనంతరం రుషికొండ గీతం కాలేజీని సందర్శిస్తారు. సాయంత్రం 6.55 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు.

అప్పన్న సన్నిధిలో విశ్వం చిత్ర యూనిట్



అప్పన్న ఆలయంలో హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీనువైట్ల తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం విశ్వం చిత్ర యూనిట్ దర్శించుకుంది. ఆ చిత్రం హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల, నటులు బెనర్జీ, పృథ్వీ, షకల శంకర్ తదితరులు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏ విధమైన విద్యుత్ సమస్యలు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు కోనసీమ, కాకినాడ, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏపీఈపీడీసీఎల్ ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా 11 జిల్లాల అధికారులతో సీఎండీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు. తుఫాన్ వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు సీఎండీ వెల్లడించారు. భారీ వర్షాల ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్లకొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాటి సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నెం 1912 లేదా కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని పృథ్వీతేజ్ ఇమ్మడి విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయం - 83310 18762	
విశాఖపట్నం	73822 49881
అనకాపల్లి	94906 10022
అల్లూరి సీతారామరాజు	94906 10026

శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

దాబాగార్డెన్స్: అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. శబరిమలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తూ.. 5, 6, 7 రోజుల ప్యాకేజీ ప్రకటించింది. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఈ వివరాలు వెల్లడించారు. అయ్యప్ప మాలధారుల కోసం ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. విశాఖ జిల్లాతో పాటు ఒడిశాలోని నౌరంగపూర్, కోరాపుట్, జైపూర్ ప్రాంతాల భక్తులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఐదు రోజుల యాత్ర

విశాఖలో బయలుదేరి విజయవాడ, మేల్ మరవత్తూర్, ఎరుమేలి, పంబ, స్వామి సన్నిధానం చేరుకుంటుంది. దిగువ ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, విజయవాడ మీదుగా విశాఖపట్నం చేరుకోవడంతో ఈ యాత్ర ముగుస్తుంది. ప్రయాణ చార్జీలు ఒక్కరికి సూపర్ లగ్జరీ రూ.6,600, అల్ట్రా డీలక్స్ రూ.6,600, ఇంద్ర రూ.8,500.

ఆరు రోజుల యాత్ర

విశాఖలో బయలుదేరి విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేళి, పంబ, సన్నిధానం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, అన్నవరం మీదుగా విశాఖపట్నం చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్రయాణ చార్జీలు ఒక్కరికి సూపర్ లగ్జరీ రూ.7 వేలు, అల్ట్రా డీలక్స్, రూ.7 వేలు, ఇంద్ర, రూ.9 వేలు.

ఏడు రోజుల యాత్ర

విశాఖలో బయలుదేరి విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం మీదుగా విశాఖపట్నం చేరుకోవడంతో ముగుస్తుంది. ప్రయాణ చార్జీలు ఒక్కరికి సూపర్ లగ్జరీ రూ.7,600, అల్ట్రా డీలక్స్ రూ.7,600, ఇంద్ర రూ.10 వేలు.

మరిన్ని వివరాలకు సంప్రదించాల్సి నంబర్లు	
విశాఖ డిపో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్)	90522 27083
విశాఖపట్నం డిపో మేనేజర్	99592 25594
ద్వారకా బస్టేషన్ ఏటీఎం	91001 09731
కో-ఆర్డినేటర్ పీవీఎన్ రావు	73829 14219

కుళ్లిన టమాటాల ఫొటో తీసి పంపండి

- రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్లకు వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ ఆదేశం
- డ్వాక్రా సంఘాలపై భారం పడనివ్వం



రైతుబజార్‌లో కుళ్లిపోయిన టమాటాలు (ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: టమాటాలు కుళ్లిపోతే ఫొటోలు తీసి పంపండి..వాటికి డబ్బులు వాపసు ఇస్తాం..అలాగే రవాణా చార్జీలు తగ్గిస్తామని అన్ని రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్లకు జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి రాకేష్ ఆదేశాలు జారీ చేశారు. కుళ్లిపోయిన టమాటాలను ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తోందని సోమవారం సాక్షిలో అమ్మలేం.. కొనలేం! శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. మర్రిపాలెంలోని ప్రభుత్వ గొడౌన్ నుంచి రైతుబజార్లకు టమాటా సరఫరా అవుతుంది. రవాణా చార్జీలు డ్వాక్రా వ్యాపారులే భరించాలి. సీతమ్మధార రైతుబజార్‌కు క్రేటుకు రూ.25, కొమ్మాది, ఎంవీపీ బజార్లకు రూ.30 చొప్పున చెల్లించాలి. ప్రతి క్రేటులోనూ రెండు కిలోల వరకు తరుగుతోపాటు, దెబ్బతిన్న, కుళ్లిన పండ్లు ఉంటున్నాయి. వినియోగదారులు చిదిగిపోయిన, కుళ్లిన టమాటా తీసుకోవట్లేదని డ్వాక్రా సంఘాలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో సాక్షి కథనంలో వారికి ఊరట కలిగించింది. కుళ్లిన టమాటాలకు డబ్బులు వసూలు చేయబోమని, అలాగే రవాణా చార్జీల నుంచి మినహాయింపు కల్పిస్తామని ప్రకటించింది. అనంతపురంలో వర్షాలు పడుతుండడం, రవాణా సమయంలో టమాటాలు డ్యామేజ్ అయ్యాయని రాకేష్ తెలిపారు.

సబ్సిడీ టమాటా రాలేదు

సబ్సిడీ టమాటాలు సోమవారం విశాఖలోని ఏ రైతుబజార్‌కు రాలేదు. అల్పపీడనం కారణంగా నాలుగు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం ప్రకటించడం తెలిసిందే. దీంతో వినియోగదారులు ఇప్పటినుంచే అధిక పరిమాణంలో కూరగాయలు కొనుగోలు చేశారు. అయితే సబ్సిడీ టమాటాలు సోమవారం రాకపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎటు చూసినా నీలి సంద్రం పైకి చూసినా నీలాంబరం



సాగరాన అందాల విందు
అలలకు ఎన్నటికీ రాదు అలుపు
ఎగసే తరగల నురగల పిలుపు
అంబరంపై చాటాలని గెలుపు.
కలకలమైన విశాఖ సాగరం
నిలబడితే నిలవదు పారం
ఇది తీరం చాటిన జీవన సారం
సాహసాల స్వాప్నికుడా
కెరటాలే చక్రాలై కదిలిరా ఓడవై
విజయాన్ని తిరగరాయి
మిన్నంటే మేడవై

ఈ సంద్రమంత చిత్రం ఆర్కేబీచ్‌లో సోమవారం సాయంత్రం సాక్షత్కరించింది. ఈ బ్లూటీఫుల్ లుక్‌ను చూసి నగరవాసులు తరించారు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జామియా మసీదుకు పొంచి ఉన్న ప్రమాదం



జామియా మసీదు వెనుక భాగాన కుప్పకూలిన స్టెయిర్‌కేస్

దాబాగార్డెన్స్: విశాఖ చరిత్రలో గల జామియా మసీదు కూలేందుకు సిద్ధంగా ఉంది. సోమవారం కురిసిన భారీ వర్షానికి చెంగల్రావుపేటలోని జామియా మసీదు వెనుక భాగాన స్టెయిర్‌కేస్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే ఘటన మధ్యాహ్నం నమాజ్ సమయంలో జరిగి ఉంటే పలువురు ప్రమాదానికి గురయ్యేవారని మసీదు కమిటీ ప్రతినిధులు సాక్షికి తెలిపారు. ఈ మసీదును ఇటీవల ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశీలించి హెచ్చరికలు కూడా జారీ చేసింది.

20న మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్టుల సదస్సు

సీతంపేట: ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు ఢిల్లీలోని ఎయిమ్స్ జవహర్‌లాల్ నెహ్రూ ఆడిటోరియంలో 43వ అఖిలభారత మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్టుల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేవీ వెంకటేశ్వరరావు తెలిపారు. దేశం నలుమూలల నుంచి సుమారు 1500 నుంచి 2వేల మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. దేశంలో ఉన్న మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లందరికీ ఒకే విద్యార్హత, శిక్షణాకాలం, జీతభత్యాలు ఉండాలని, మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్టులకు కౌన్సిల్ ఏర్పాటు చెయ్యాలని ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి జె.పి. నడ్డా దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ల్యాబ్ టెక్నీషియన్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. సెమినార్‌లో పాల్గొన దలచిన వారు, అసోసియేషన్ సభ్యత్వం కోసం 98481 72322 నంబరుకు సంప్రదించాలన్నారు.

కక్ష సాధింపుతోనే కార్పొరేటర్ సురేష్‌పై రౌడీషీట్

- ఎత్తివేయాలని సీపీకి వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల వినతి



నగర పోలీస్ కమిషనర్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

దాబాగార్డెన్స్: కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్‌పై రాజకీయ కక్షతో నమోదు చేసిన అక్రమ రౌడీషీట్‌ను తొలగించాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు సారథ్యంలో కార్పొరేటర్లు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తరఫున సీపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవకు సురేష్ పరితపిస్తుంటారని, కౌన్సిల్ నుంచి గౌరవ వేతనం కూడా తీసుకోకుండా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకొని.. కూటమి నేత కక్ష సాధింపునకు ఫలితంగా సురేష్‌పై రౌడీషీట్ నమోదు చేయడం దారుణమన్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న సురేష్‌ను అణగదొక్కాలని ప్రయత్నించడం అన్యాయమన్నారు. అధికార దుర్వినియోగం చేస్తూ ఓ సీఐ.. కూటమి నేతపై స్వామి భక్తిని ప్రదర్శిస్తూ ఒక్క కేసు ఉన్నా రౌడీషీట్ తెరుస్తామని నిస్సిగ్గుగా చెప్పడం..ఈ ప్రభుత్వంలో అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడటమే లక్ష్యంగా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించిన కార్పొరేటర్ సురేష్ పై రాజకీయ కుట్రతో అక్రమ కేసులు బనాయించి.. వాటి ఆధారంగా రౌడీషీట్‌ను నమోదు చేసి వేధించడం దారుణమన్నారు. ఈ విషయంపై తనకు సమాచారం లేదని.. ఇది స్థానిక ఏసీపీ/సీఐ స్థాయిలో అంశమే అని, తాను కూడా ఈ అంశాన్ని పరిశీలిస్తానని సీపీ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్లు తెలిపారు. సీపీని కలిసిన వారిలో కార్పొరేటర్లు కె.వి.ఆర్.స్వాతి, మొల్లి లక్ష్మి, కె.అనిల్ కుమార్ రాజు, నక్కిళ్ల లక్ష్మి, అక్కరమాని పద్మ, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, గుడివాడ అనూష, ఎ.రోహిణి, ముర్రు వాణి, ఉరుకూటి రామచంద్రరావు, చెన్నా జానకీరామ్, తిప్పల వంశీరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, రెయ్యి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఐటీఐ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఐటీఐ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

కంచరపాలెం: కంచరపాలెం పాత ఐటీఐ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం-డీఎల్‌టీసీ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. జిల్లా నూతన అధ్యక్షుడిగా బొత్స ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు-1గా డి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు-2గా పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.వి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా ఆర్.సతీష్‌కుమార్, సీహెచ్ లలితాకుమారి, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, ఈసీ సభ్యులుగా కె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, జె.సత్యనారాయణ, ఎస్.వి.వి.ఎస్ వరప్రసాద్ ఎన్నికయ్యారు. కె.ఎస్.శ్రీనివాసరావు, ఎం.రవికుమార్, పి అప్పలరాజు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

విశాఖ విద్య: టెట్ అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు తెలిపారు. ఆదాయపు పన్ను పరిధిలో లేకుండా, నాలుగు చక్రాల వాహనం ఉండకుండా, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న వారు ఉపకారవేతనం పొందేందుకు అర్హులన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన సంస్థల్లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి, డీఎస్సీ కోసం తగిన తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 21 వరకు ఆన్‌లైన్ ద్వారా (http://jnanabhumi. ap. gov. in) దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ద్వారా అభ్యర్థులనుఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

తిరుమలనగర్‌కు కేంద్ర జలశక్తి అవార్డు

- 22న అవార్డు అందుకోనున్న అసోసియేషన్ ప్రతినిధులు


ఉద్యానవనాల్లో ఏర్పాటు చేసిన నీటి గుంటల్లో చేరిన వర్షపు నీరు

అగనంపూడి : జీవీఎంసీ 87వ వార్డు కణితి సమీపంలోని తిరుమల నగర్‌కు మరోసారి జాతీయ అవార్డు దక్కింది. మూడేళ్ల కిందట కేంద్ర జలవనరుల శాఖ వాటర్ హీరో అవార్డుతో సత్కరించగా.. ఈ ఏడాది రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్ డబ్ల్యూఏ) విభాగంలో జాతీయ స్థాయిలో తృతీయ బహుమతిని దక్కించుకుంది. ఈ మేరకు కేంద్ర జలశక్తి వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ అవార్డును తిరుమలనగర్‌కు ప్రకటించారు. జల అవార్డుల విజేతల వివరాలను న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో ఆయన విడుదల చేశారు. 9 విభాగాల్లో 38 మంది విజేతలను సంయుక్తంగా ప్రకటించగా.. పలు విధాలుగా నీటిని పొదుపు చేయడంలో తీసుకున్న చర్యలను మెచ్చుకుని ఆర్ డబ్ల్యూఏ విభాగంలో తిరులమనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్‌కు ఈ గౌరవం దక్కింది. తిరుమలనగర్‌లో వంద పైకప్పు వర్షపునీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టి.. 16 లక్షల లీటర్ల నీటిని ఆదా చేయగలిగారని అవార్డుల ప్రకటించే సమయంలో మంత్రి వెల్లడించారు. పార్కుల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో 62 నీటి సంరక్షణ గుంటలను తవ్వడం ద్వారా ఉపరితల నీటి ప్రవాహాన్ని అడ్డుకొని 30.97 లక్షల లీటర్ల నీటిని ఆదా చేయడం, భూగర్భ జలాల సంరక్షణకు దోహదపడిందని పేర్కొన్నారు. వీటికి తోడు కాలనీలో 3 వేలకు పైగా చెట్లను పెంచడం, స్వచ్ఛ భారత్, ఘన వ్యర్థ పదార్థాల నిర్వాహణ, కంపోస్ట్ ఎరువుల వాడకం, బహిరంగ మల విసర్జనకు మిషన్లు ఏర్పాటు చేయడం వంటి కార్యకలాపాలు నిర్వహించడంతో తృతీయ బహుమతి దక్కించుకున్నామని తిరుమలనగర్ అసోసియేషన్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

శ్రద్ధా ఫౌండేషన్‌కు 9 మంది నిరాశ్రయుల అప్పగింత


ముంబయి వెళ్లేందుకు సిద్ధమైన నిరాశ్రయులు

అల్లిపురం: మానసిక రుగ్మతతో బాధపడుతున్న తొమ్మిది మంది నిరాశ్రయులకు ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ సంయుక్తంగా చికిత్స అందించి.. వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చాయి. కోలుకున్న వారిలో రాయబరేలికి చెందిన హరిప్రసాద్, బనారస్‌కు చెందిన రామ్‌మనోహర్, గుదియాన, బిందో, నేపాల్ దదూజాకు చెందిన గౌతమ్, సుందర్‌గంజ్(ఒడిశా)కు చెందిన గోరంగో నాయక్, రాయ్‌గడ్‌కు చెందిన జితేంద్ర సాహు, బిహార్‌కు చెందిన బిపిన్ కుమార్, గ్వాలియర్‌కు చెందిన సోనమ్ ఉన్నారు. వీరి చిరునామాలు తెలుసుకుని.. టూటౌన్ పోలీసుల సహకారంతో సోమవారం వీరిని ముంబయిలోని శ్రద్ధా కార్యాలయానికి తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వీరందరినీ శ్రద్ధా ప్రతినిధి ధృవ్ బడేకర్, స్టాఫ్ నర్స్ సుప్రియ, డ్రైవర్ అబిద్, నీలేష్ తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ హరేందిర ప్రసాద్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చే వినతులను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, వినతులు రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయి పర్యటన చేసి.. ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన.. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత వారం అందిన ఫిర్యాదుల పరిష్కారం, తాజా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి 120 వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 48, జీవీఎంసీకి చెందినవి 29, పోలీసు శాఖకు సంబంధించి 9, ఇతర శాఖలకు సంబంధించి 34 ఉన్నాయి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామ్మూర్తి, జీవీఎంసీ ఏడీసీ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'జీవీఎంసీ'కి 65 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 65 వినతులు అందాయి. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్ హరి వెంకటకుమారి, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి 8, జోన్-3 నుంచి 10, జోన్-4 నుంచి 8, జోన్-5 నుంచి 9, జోన్-6 నుంచి 9, జోన్-7 నుంచి ఒకటి, జోన్-8 నుంచి 6 ఫిర్యాదులు ఉన్నాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 13 ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీర్ శివప్రసాదరాజు, డీసీ(రెవెన్యూ) శ్రీనివాసరావు , పలువురు అధికారులు పాల్గొన్నారు.


సమస్య తెలుసుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు : సీపీ

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 58 ఫిర్యాదులు అందాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని సీపీ ఆదేశించారు.


ఫిర్యాదుదారితో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విహార యాత్రకు వెళ్లిన ఇంటర్ విద్యార్థి అదృశ్యం

- ఒడిశాలో సంఘటన
- రెండు రోజులుగా గాలిస్తున్నా.. కానరాని ఆచూకీ


సాత్విక్

అగనంపూడి: విహారయాత్రకు వెళ్లి నదిలో కొట్టుకుపోయిన విద్యార్థి కోసం ఒడిశా పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అగనంపూడి నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన రచయిత కంచిపాటి నరసింహమూర్తి తన కుమారుడు సాత్విక్ (18) గాజువాకలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు సాత్విక్‌తోపాటు ఆమె సోదరి మౌని ఒడిశాలోకి సుందర్‌ఘర్ ఎన్టీపీసీలో పని చేస్తున్న తన మేనమామ ఇంటికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం అక్కడ ఉన్న ఐదు కుటుంబాలకు చెందిన 18 మంది బలిశంకర్ బ్లాక్ పరిధిలోని ఘోగర్ కునకుంద నదికి విహార యాత్రకు వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి ఉధృతికి సాత్విక్ గల్లంతయ్యాడు. తలసారా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో అగనంపూడిలోని బాలుడి తల్లిదండ్రులు, బంధువులు తల్లడిల్లుతున్నారు.

అపోలోలో ఛాతీనొప్పి క్లినిక్ ప్రారంభం


క్లినిక్ ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో ఛాతీనొప్పి క్లినిక్‌ను సోమవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె సమస్యలను ప్రారంభ దశలో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత యువత ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండె నొప్పిపై సందేహం ఉన్న వారికి ఈ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. గుండె వ్యాధులపై పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీసులకు ఈ క్లినిక్‌లో గుండె నొప్పి పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. అపోలో రీజినల్ సీఈవో వై.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హెల్త్‌సిటీ అపోలో, రాంనగర్ అపోలోలో ఛాతీనొప్పి క్లినిక్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రి సీవోవో రామచంద్రారావు, వైద్యులు ప్రాణిగ్రహి, శశాంక్, చక్రధర్, రవికాంత్, త్రివేది, విజయ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎంవీపీలో భారీ కొండచిలువ హల్‌చల్


భారీ కొండచిలువను పట్టుకున్న కిరణ్ బృందం

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలో భారీ కొండ చిలువ ప్రత్యక్షం కావడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. సెక్టార్-7లో రైతుబజార్ ముఖ ద్వారాన్ని ఆనుకొని ఉన్న ఓ దుకాణంలో సోమవారం ఇది ప్రత్యక్షమైంది. దాదాపు 15 అడుగుల పొడవు ఉన్న ఈ కొండచిలువను దుకాణ యజమానురాలు గుర్తించి పక్క షాపుల వారికి తెలిపింది. స్థానికులు పోలీసులతో పాటు స్నేక్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని కొండ చిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. స్నేక్ క్యాచర్లు కిరణ్, నాగరాజు తదితరులు కొండ చిలువను ప్రదర్శించగా.. యువకులు దానితో సెల్ఫీలు దిగారు. అటవీ శాఖ అధికారుల సూచనలతో కొండ చిలువను అడవిలో వదిలేస్తామని స్నేక్ క్యాచర్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు కైలాసగిరి, కంబాల కొండలను ఆనుకుని ఉన్న గెడ్డ ద్వారా ఇది ఎంవీపీ కాలనీకి వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

కాఫీ సేకరణ ధరల పెంపు


చర్చిస్తున్న జీసీసీ ఎండీ కల్పనాకుమారి, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

మహారాణిపేట: గిరిజనుల వద్ద నుంచి సేకరిస్తున్న కాఫీ కొనుగోలు ధరల పెంపునకు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2024-25 సంవత్సరానికి కాఫీ సేకరణ ధరలను నిర్ణయించేందుకు సోమవారం జీసీసీ కేంద్ర కార్యాలయంలో అపెక్స్ కమిటీ సమావేశమైంది. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి, ఐటీడీఏ పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, కాఫీ బోర్డు ఆఫ్ ఇండియా(బెంగళూరు) డాక్టర్ డి.ఆర్.బాబు రెడ్డి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గత సంవత్సరం కాఫీ సేకరణ ధరలు అరెబికా పార్చ్‌మెంట్ రకానికి కిలో రూ.280, అరెబికా చెర్రి రకానికి రూ.145, రోబస్టా చెర్రి కాఫీ రకానికి రూ.70 చొప్పున ఉండేవి. అంతర్జాతీయ కాఫీ ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం కాఫీ సేకరణ ధరలను అరెబికా పార్చ్‌మెంట్ రకానికి రూ.285, అరెబికా చెర్రి రకానికి రూ.150, రోబస్టా చెర్రి కాఫీ రకానికి రూ.80 చొప్పున నిర్ణయించారు. ఈ సందర్భంగా జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ గిరిజన కాఫీ రైతుల సంక్షేమం కోసం ధరలు పెంచినట్లు తెలిపారు. పెంచిన కాఫీ సేకరణ ధరలపై పాడేరు ఏజెన్సీలోని గిరిజన కాఫీ రైతులందరికి విస్తృత అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రకటించిన కాఫీ ధరల కంటే తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ రైతులకు ఎండీ విజ్ఞప్తి చేశారు. కాఫీ సేకరణకు సంబంధించి ఏజెన్సీలోని మారుమూల పల్లె ప్రాంతాలకు కూడా జీసీసీ సిబ్బంది వెళ్లి.. రైతు ఇంటి ముంగిటనే ఎలక్ట్రానిక్ కాటా ద్వారా కచ్చితమైన తూకంతో సేకరించాలన్నారు. కాఫీ సేకరణకు సంబంధించి నగదును రైతు బ్యాంకు ఖాతాలోకి నేరుగా 24 గంటల్లోగా జమ చేస్తామన్నారు. గత సంవత్సరం 565 మెట్రిక్ టన్నుల కాఫీని గిరిజన రైతుల నుంచి సేకరించగా, ఈ సంవత్సరం 2000 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జీసీసీ జనరల్ మేనేజర్(కాఫీ) ఎంవీపీఎస్ ఉమాదేవి పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలపై తీవ్ర పని ఒత్తిడి

'ఉషా' గౌరవ అధ్యక్షురాలు మణి


ధర్నాలో మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షురాలు మణి

సీతమ్మధార: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీలకు ఎంపీహెచ్ఏలుగా పదోన్నతులివ్వాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ విలేజ్/వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఉషా) గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో సోమవారం నిర్వహించిన హెల్త్ సెక్రటరీల ధర్నాలో ఆమె మాట్లాడారు. హెల్త్ సెక్రటరీలను వైద్య-ఆరోగ్యశాఖ పరిధిలోకి పూర్తి స్థాయిలో తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వీరంతా జీవీఎంసీ, ఎంపీడీవో, డీఎంహెచ్‌వో పరిధిలో ఉన్న కారణంగా తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా వివిధ రకాలుగా ఆందోళన చేస్తున్నా.. ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. పలు జిల్లాల్లో వివిధ శాఖలు అదనపు పనులు అప్పగించడం అన్యాయమన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు అయిన హెల్త్ సెక్రటరీలకు సెలవులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. దాదాపుగా 60కి పైగా యాప్‌ల కారణంగా పని ఒత్తిడితో మానసిక ప్రశాంతత ఉండటం లేదన్నారు. వ్యాక్సిన్, క్యారియర్ రవాణా భత్యం ఇవ్వాలని, యూనిఫాం అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలేజ్ క్లినిక్‌లను సబ్ సెంటర్లుగా మార్చే అంశాలను పరిశీలించాని కోరారు. ఆదివారాలు, పండగ రోజుల్లో డ్యూటీలు వేయవద్దన్నారు. ధర్నాలో అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు జి.కల్యాణి, అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి, కార్యనిర్వాహక కార్యదర్శి జి.సంధ్యారాణి, పి.రాజ్యలక్ష్మి, జి.లక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, ఆర్.సరోజిని, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ముగిసిన నృత్యోత్సవాలు


పసుపర్తికి వెంపటి చినసత్యం జీవ సాఫల్య పురస్కారంతో సత్కరించిన సెంచూరియన్ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు

మద్దిలపాలెం: విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్ర సంయుక్తంగా నిర్వహిస్తున్న వెంపటి చిన్న సత్యం జయంతి నృత్యోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. కళాభారతి ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాట్య గురువులు పసుమర్తి వెంకటేశ్వర శర్మకు వెంపటి చిన సత్యం జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. సెంచూరియన్ యూనివర్సిటీ కులపతి జి.ఎస్.ఎన్.రాజు, జిల్లా పర్యాటకశాఖాధికారి జ్ఞానవేణి, కళారత్న సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత బాలకొండలరావు చేతులమీదుగా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శలు అందరినీ అలరించాయి. విజయ నిర్మాణ్ అధినేత సురపనేని విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా మన్నించు..


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వదిలేసిన వాడిపోయిన పూలదండలు

సీతమ్మధార: గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 2వ తేదీన పెద్ద ఎత్తున రాజకీయ నాయకులు, అధికారులు మహాత్ముడి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలు జరిగి రెండు వారాలైంది. కానీ గాంధీ విగ్రహం వద్ద పూలదండలు తొలగించడానికి జీవీఎంసీ పారిశుధ్య విభాగానికి ఏ మాత్రం తీరిక దొరకలేదు! పూలమాలల దారాలు తెగిపోయి.. ఆయన విగ్రహం కాళ్ల వద్ద అలాగే పడి ఉన్నాయి. మహాత్ముడి స్ఫూర్తితో నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నట్లు అధికారులు వల్లె వేస్తున్నారు. కానీ మహాత్ముడి విగ్రహం వద్దే అపరిశుభ్రంగా ఉండటం వారి నిర్లక్ష్యానికి నిదర్శమని నగరవాసులు మండిపడుతున్నారు. వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి


విద్యార్థినులతో సమావేశమైన లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్-10లోని గిరిజన కళాశాల విద్యార్థినుల వసతిగృహాన్ని సోమవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సందర్శించారు. ఇక్కడ ఎంత మంది వసతి పొందుతున్నారు? వసతి, భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. హాస్టల్ వార్డెన్ ఝాన్సీ పాల్గొన్నారు.

17 నుంచి నరాల వ్యాధులపై జాతీయ సదస్సు

మహారాణిపేట: నరాలకు సంబంధించిన వ్యాధులపై ఈ నెల 17 నుంచి నగరంలో నాలుగు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ గోపి తెలిపారు. కేజీహెచ్ న్యూరాలజీ విభాగంలో సోమవారం డాక్టర్ బుచ్చిరాజు మీడియాతో మాట్లాడారు. సదస్సులో భాగంగా నరాలకు సంబంధించిన అనేక వ్యాధుల మీద చర్చ జరుగుతుందని, దేశ, విదేశాల నుంచి దాదాపు రెండు వేల మంది వైద్యులు పాల్గొంటారని తెలిపారు. 17న న్యూరాలజీలో నిరంతరం వైద్య విద్యా(సీఎంఈ) కార్యక్రమాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభిస్తారన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు 31వ జాతీయ సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. పలు అంశాలపై ప్రముఖ న్యూరాలజిస్టుల ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ గోపి తెలిపారు. ఈ నెల 20న ఉదయం 6 గంటలకు రన్ ఫర్ బ్రెయిన్ పేరిట 10కె మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో న్యూరాలజీ వైద్యులు సతీష్, కిశోర్ బాబు, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగాల్లో దివ్యాంగ అభ్యర్థులకు అవకాశం

మురళీనగర్ : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధనేతర పోస్టుల నియామకంలో దివ్యాంగ అభ్యర్థులకు అవకాశాన్ని కల్పిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. తమ సంఘం అభ్యర్థన మేరకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ ఎస్పీడీ ఉత్తర్వులు జారీ చేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సవరణల ప్రకారం దివ్యాంగులకు అన్ని పోస్టుల్లోనూ సమాన అవకాశాలు కల్పించినట్లవుతుందన్నారు.

ప్రజల సొమ్ముతో విహార యాత్రలా?

- కార్పొరేటర్లకు సీపీఎం ప్రశ్న?


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్ముతో అధ్యయన యాత్ర పేరిట కార్పొరేటర్లు విహార యాత్రలు చేసుకోవడం సిగ్గుచేటని సీపీఎం నాయకులు అన్నారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం సీపీఎం నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడారు. జీవీఎంసీ కార్పొరేటర్ల టూర్‌కి సీపీఎం వ్యతిరేకమన్నారు. ప్రజాధనం దుర్వినియోగంలో తెలుగుదేశం ముందుందని, అధ్యయన యాత్ర పేరిట విహార యాత్రలు చేయడాన్ని ప్రజలు హర్షించరన్నారు. ఈ నెల 20 నుంచి 27 వరకు అధ్యయన యాత్ర పేరిట కోయంబత్తూర్, మైసూర్, బెంగుళూర్ నగరాలను కార్పొరేటర్లు సందర్శించడానికి నిర్ణయించారని.. ఈ యాత్ర వల్ల విశాఖ ప్రజలకు ఎటువంటి మేలు జరగదన్నారు. విహార యాత్రకు ఖర్చు పెట్టే బదులు.. కొండవాలు, లోతట్టు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకుడు కృష్ణారావు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం





బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల రోడ్లపైకి వర్షం నీరు చేరింది. సాయంత్రం వరకు తెరిపిచ్చిన వాన రాత్రి మళ్లీ ఓ మోస్తరుగా కురిసింది. ఉదయం వివిధ పనుల కోసం బయటకు వచ్చిన వాళ్లు వర్షంలో తడిసిపోయారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సిటిజనులు బీచ్‌కు క్యూ కట్టారు. ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం